నిర్లక్ష్యపు నీడలో ఎన్‌ఏడీ ఫ్లైఓవర్



ఫ్లైఓవర్ నడక వంతెన వద్ద మాయమైన రెయిలింగ్



ఆకతాయిలు ధ్వంసం చేసిన ఫౌంటెయిన్ రెయిలింగ్, గ్రానైట్ పలకలు



మెట్ల మార్గంలో చోరీకి గురైన స్టీల్ రెయిలింగ్

- ప్రతిష్టాత్మక వంతెన నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- మూలకు చేరిన వాటర్ ఫౌంటెయిన్
- అధ్వానంగా సెంటర్ సర్కిల్
- కనుమరుగవుతున్న పచ్చదనం
- పూర్వ వైభవం తేవాలని కోరుతున్న స్థానికులు, ప్రయాణికులు

గోపాలపట్నం: రాష్ట్రానికే తలమానికంగా నిలిచేలా నగరంలో నిర్మించిన ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఎక్కడా లేని విధంగా రోటరీ పద్ధతిలో ఈ వంతెనను ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. విశాఖ విమానాశ్రయం నుంచి వచ్చే విదేశీయులు, నగరానికి వచ్చే పర్యాటకులకు ఎన్‌ఏడీ జంక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అప్పటి ప్రభుత్వం ఆలోచించి నిర్మించిన ఈ బ్రిడ్జి నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. వంతెనపై ప్రారంభంలో ఉన్న సోయగాలు నేడు కానరావడం లేదంటూ స్థానికులు, ప్రయాణికులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్లైఓవర్‌పై పాదచారులు నడిచే సెంటర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్‌ను చూసి కొద్దిసేపు అక్కడ గడిపేందుకు స్థానికులు వచ్చేవారు. సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులంతా వచ్చి సంతోషంగా కాసేపు గడిపి వెళ్లేవారు. ఇప్పుడు అక్కడ ఆకతాయిల ఆగడాలు పెరిగిపోవడంతో ఫౌంటెయిన్ వైపు వచ్చేందుకు స్థానికులు భయపడుతున్నారు.

స్టీల్ రెయిలింగ్‌లు మాయం

ఫ్లైఓవర్ బ్రిడ్జి మెట్ల మార్గాలు, సెంటర్ డివైడర్ తదితర ప్రాంతాల్లో అందంగా ఉండేందుకు వేసిన స్టీల్ రెయిలింగ్‌ను ఆకతాయిలు, మందుబాబులు రాత్రి వేళల్లో విరిచి అమ్ముకుంటున్నారు. గతంలో పలు మార్లు ఇలాగే విరిచిన సందర్భాల్లో మరమ్మతులు చేపట్టారు. కొద్ది కాలంగా వీటిని అసలు పట్టించుకోవడం లేదు.



ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జి సెంటర్ సర్కిల్‌లో పాడైన వాటర్ ఫౌంటెయిన్

నిర్వహణ బాధ్యత ఎవరిది..?

గతంలో ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ వంతెన నిర్వహణ బాధ్యతను వీఎంఆర్‌డీఏ చూసేది. ఇపుడు ఎవరు చూస్తున్నరో తెలియని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ బ్రిడ్జి నిర్లక్ష్యానికి గురైందని, ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, స్థానికులు విమర్శిస్తున్నారు. కనీసం వంతెనపై మొక్కలకు నీరు పోసే దిక్కు లేకుండా పోయిందని వాపోతున్నారు. గత ప్రభుత్వంలో ఆహ్లాదకరంగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జి.. నేడు దయనీయ స్థితికి చేరిందని చెబుతున్నారు.

పచ్చదనం కనుమరుగు

ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌పై ఆహ్లాదకరమైన పచ్చదనం కనుమరుగవుతోంది. ఎగువ సర్కిల్‌లో వాటర్ ఫౌంటెయిన్ చుట్టూ ఉన్న పచ్చదనం పాడైపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి కాస్తా తేరుకున్నా ఆ తరువాత పచ్చదనమంతా ఎండిపోతోంది. దిగువ సర్కిల్‌లో చాలా మేరకు పచ్చని మొక్కలు ఎండిపోయాయని, ఇటీవలే జీవీఎంసీ సిబ్బంది వీటిని తొలగించారని స్థానికులు చెబుతున్నారు. ఫౌంటెయిన్ పూర్తిగా పాడైందని, దీనిలో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమల ఆవాసంగా మారింది. దీనిపై వేసిన గ్రానైట్ పలకలు ఊడిపోయాయి.



వంతెనపై కనుమరుగవుతున్న మొక్కలు

ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

ప్రతిష్టాత్మకమైన ఈ బ్రిడ్జిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. ప్రజలు ఇక్కడ సాయంత్రం సమయాల్లో సరదాగా గడిపేలా ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నారు. వంతెనను అందంగా.. ఆకర్షణీయంగా మలిచాలని, వాటర్ ఫౌంటెయిన్‌ను బాగు చేయాలని, వంతెనపై పచ్చదనం నిండి ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మద్రిపాలెం: జోన్–2 ఎన్‌ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి 11 కేవీ ఎయిర్‌పోర్ట్, శాంతినగర్ ఫీడర్ల నిర్వహణ, మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాధవధార, సాయినగర్, పార్వతీనగర్, టాటా మోటర్స్ ఏరియా, జాకీర్ హుస్సేన్ నగర్, ఎన్‌ఏడీ, గణేష్ నగర్, కరాస, గౌరీనగర్, శాంతినగర్, అంబేడ్కర్ కాలనీ, నేతాజీనగర్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద పందుల సంచారం



కార్యాలయ ఆవరణలో పందులు

ఫోకస్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు పరిధి ములగాడ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పందుల సంచారం అధికం కావడంతో దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. కార్యాలయ పరిసరాల్లోనే ఇవి విచ్చలవిడిగా సంచరించడంతో అక్కడికి వివిధ సమస్యలపై వచ్చేవారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

సాయి మందిరంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సాయినాథుడు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలోని సద్గురు షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. బాబాకు హారతి సమర్పించి, అభిషేకాలు చేశారు. వెండి ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు బాబా పీఠం ముందు భజనలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించారు. సాయంత్రం బాబాకు నక్షత్ర హారతి పూజలు జరిపారు. బాబా పాదుకలను పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఫౌండేషన్ సభ్యులు

మల్కాపురం: యువత మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పద్మ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం 58వ వార్డు చిన్న ములగాడలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న ములగాడలో ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఇతర ప్రాంతాలకు చెందిన యువత ఇక్కడిచి వచ్చి మాదకద్రవ్యాలు సేవించి, మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యను తాము పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం చొరవ చూపుతామన్నారు. అనంతరం చెడు వ్యసనాల వల్ల యువతకు కలుగుతున్న నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న రైల్వే అధికారులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు

కంచరపాలెం: జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం మద్రిపాలెం రైల్వే ట్రెనింగ్ సెంటర్‌లో జీవీఎంసీ సమకూర్చిన కొబ్బరి, సపోట, బాదం తదితర మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ సి.వి.వి.ఎస్.ప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ పి.శ్రీనివాసరావు, ఎస్.అమర్‌నాథ్, రైల్వే అధికారులు, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

తప్పిపోయిన 2 గంటల్లోనే బాలుడి ఆచూకీ లభ్యం



కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

డాబాగార్డెన్స్: తప్పిపోయిన మూడున్నరేళ్ల బాలుడిని రెండు గంటల్లోనే వన్‌టౌన్ పోలీసులు వెతికి పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు తన సిబ్బందిని అప్రమత్తం చేసి బాలుడిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. టౌన్ కొత్తరోడ్డుకు చెందిన నాయుడు తన భార్యతో కలిసి స్థానికంగా నివాసం ఉంటున్నాడు. వీరి మూడున్నరేళ్ల కుమారుడు రిత్విక్‌రాజ్‌తో కలిసి బయటికి వెళ్లేందుకు గురువారం ఉదయం వచ్చారు. ఈ క్రమంలో రిత్విక్ వారి నుంచి తప్పిపోయాడు. తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ జీడీ బాబు స్పందించి సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. తప్పిపోయిన బాలుడిని రెండు గంటల్లోనే వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్పీ అలివేణికి పరామర్శ



ఆర్పీ అలివేణిని పరామర్శిస్తున్న పేడాడ జ్యోత్స్న

గోపాలపట్నం: టీడీపీ నాయకుడి వేధింపులు భరించలేక ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఆర్పీ ఎస్.అలివేణిని జగన్నాథపురంలోని ఆమె నివాసంలో గురువారం వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పేడాడ జ్యోత్స్న పరామర్శించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ ఆర్పీ అలివేణిపై తీవ్ర ఒత్తిడికి గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు సూసైడ్ నోట్ రాశారని, దీనిపై విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, అన్ని విధాలుగా ఇబ్బందులకు, భయాందోళనలకు గురిచేస్తున్నారని తెలిపారు. అలివేణిని పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండుపల్లి సతీష్‌కుమార్, సౌత్ మహిళా అధ్యక్షురాలు వాడపల్లి బంగారమ్మ ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ ఆగ్రహం



కప్పరాడలో పేరుకుపోయిన వ్యర్థాలను చూసి మండిపడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

కంచరపాలెం: వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదంటూ శానిటరీ అధికారులపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మండిపడ్డారు. జోన్–5 పరిధి 47వ వార్డులోని కంచరపాలెం, కప్పరాడ కొండవాలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. వార్డులోని రోడ్లు, కాలువలపై వ్యర్థాలు పేరుకుపోయి అస్తవ్యస్తంగా ఉండటాన్ని గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. 260, 270 సచివాలయ శానిటరీ కార్యదర్శులు నందకిషోర్, ఝాన్సీల మొబైల్ ఫోన్ ద్వారా ముఖ గుర్తింపు హాజరు(ఎఫ్‌ఆర్‌ఎస్)ను పరిశీలించి, పిన్ పాయింట్ వారీగా పారిశుధ్య కార్మికులను సర్దుబాటు చేసి వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. కాలువలు దాటి రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా దుకాణాలను వెనక్కి తరలించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై నిరుపయోగంగా ఉన్న వాహనాలను యుద్ధప్రాతిపదికన తొలగించి, వాటి కింద వ్యర్థాలను శుభ్రపరచాలన్నారు. పర్యటనలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ సుజాత

గోపాలపట్నం: మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో, శక్తిమంతులుగా తయారు కావాలని గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సుజాత సూచించారు. మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా వైద్య పరీక్షలు, పోషణ అభియాన్, తల్లీబిడ్డల సేవలు, వయో వృద్ధుల ఆరోగ్య పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయ వ్యాధి స్క్రీనింగ్ జరుగుతాయని తెలిపారు. ఇవి ఆయా ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో చేస్తారన్నారు. రక్తపోటు, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, మధుమేహం, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే వ్యక్తిత్వ వికాసం



విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపక బృందం



డ్యాన్స్ పోటీలో ప్రతిభ చూపుతున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది వార్షికోత్సవాల నిర్వహణలో భాగంగా గురువారం జోనల్ స్థాయి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు డిబేట్, డ్యాన్స్, సింగింగ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా జీవన విలువలు పెంచుకుంటారన్నారు. జోనల్ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలకు వివిధ ప్రభుత్వ కళాశాలల నుంచి అనేక మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. డిబేట్ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన వి.భవానీ, సీహెచ్ తరణి, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.జయ, పాజిటివిటీ ఆర్గ్యుమెంట్‌లో మూడు స్థానాల్లో నిలవగా, నెగిటివిటీలో జి.వైష్ణవి, ఎస్.తులసి, కె.శిరీష మూడు స్థానాల్లో నిలిచారు. సోలోసింగ్ పోటీలో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.జ్యోతి, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి బి.దేవి, డి.జ్యోతి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గ్రూప్ సింగింగ్‌లో చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఝాన్సీ అండ్ టీం, సాహితీ అండ్ టీం, ఎలీసా టీం మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. డ్యాన్స్ పోటీల్లో సౌమ్య అండ్ టీం (విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల), కృష్ణవేణి అండ్ టీం (శ్రీకాకుళం), అను అండ్ టీం (చింతపల్లి) విజయం సాధించాయి. కార్యక్రమంలో కళాశాల కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కేవీఎల్ శిరీష, బి.రాధమ్మ, విజయ ప్రశంస, జి.జ్యోతి ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, విప్ గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో ఎల్‌జీ పాలిమర్స్ సీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎంపీ శ్రీభరత్, ప్రభుత్వ విప్ గణబాబు గురువారం ప్రారంభించారు. గ్యాస్ లీకేజీ ప్రభావం అక్కడి తాగునీటిపై ఉంటుందనే కారణంతో, స్థానికులకు ఉపయోగపడే విధంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌జీ పాలిమర్స్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు అన్నదానం



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ 41వ వార్డు నాయకులు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ 41వ వార్డు శ్రేణులు లెబన్సీ మానసిక దివ్యాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వేళంగిణిరావు మాట్లాడుతూ కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ దంపతుల సేవలు ఆదర్శనీయమన్నారు. ఆమె జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సీనియర్ నాయకులు పాత్రపల్లి సునీల్ కుమార్ యాదవ్, దాలిబాని మధు, అన్నపూర్ణ, ఈశ్వరి, దేవి, స్థానికులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

గిగ్ వర్కర్ల బంద్ విజయవంతానికి పిలుపు

డాబాగార్డెన్స్: స్విగ్గీ, జొమాటో రైడర్ల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20న చేపట్టనున్న బంద్ విజయవంతం చేయాలని ఆలిండియా గిగ్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బి.జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైడర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. విశాఖ జిల్లాలో గత ఏడేళ్లుగా స్విగ్గీ, జొమాటో ప్లాట్‌ఫారమ్‌లో పని చేస్తున్న సుమారు 40 వేల మంది గిగ్ వర్కర్లు ప్రతిరోజూ సమాజానికి సేవలందిస్తున్నా, వారికి ఎటువంటి ఉద్యోగ భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక భద్రత లేక అనేక ఇబ్బందులు పడతున్నారన్నారు. చదివిన చదువుకు తగ్గ ఉపాధి లేకపోవడంతో గిగ్ వర్క్ వైపు మొగ్గు చూపాల్సి వచ్చిందని, వారికి ఏమైనా సమస్యలు వస్తే పరిష్కరించే నాథుడే లేరన్నారు. అక్రమంగా తొలగించిన రైడర్ల ఐడీలను వెంటనే పునరుద్ధరించాలని, మినిమం గ్యారెంటీ వేతనం అమలు చేయాలన్నారు. పిక్ టైం కంపల్సరీ విధానం తగ్గించాలని, ఇన్సెంటివ్ విధానం ఉండాలని, ఫేక్ నోటిఫికేషన్లు తొలగించాలన్నారు. క్యాన్సిలేషన్ ఫీజు చెల్లించాలని, బేస్ ఫెయిర్ కనీసం రూ.30కి పెంచాలని, కిలోమీటరుకు సాధారణ సమయంలో రూ.10, పిక్ టైంలో రూ.12 తక్కువ లేకుండా ఇవ్వాలన్నారు. సమ్మెలో భాగంగా ఈ నెల 22న చలో కలెక్టరేట్, 24న ఎమ్మెల్యే కార్యాలయాల ముందు ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు.

దుకాణాల తొలగింపు



ఎన్‌ఏడీ వద్ద దుకాణాల తొలగింపును పరిశీలిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రామలింగేశ్వర రెడ్డి, జెడ్పీ శంకరరావు



బంక్ జంక్షన్ వద్ద తరలిస్తున్న దుకాణాలు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం బంక్ వరకు ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు గురువారం తొలగించారు. ఎన్‌ఏడీలో ఉదయం నుంచి ప్రారంభమైన తొలగింపు సాయంత్రం వరకు కొనసాగింది. జోన్–8 టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ఈ తొలగింపులు చేపట్టారు.

ఇదే అదనుగా..

కార్పొరేటర్లు స్టడీ టూర్ కోసం రాజస్థాన్, ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లారు. దీంతో అధికారులపై నాయకుల ఒత్తిడి ఉండదని యుద్ధప్రాతిపదికన నగరం మొత్తం ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు చేపట్టారని స్థానికులు అంటున్నారు. అయితే, ఈ తొలగింపుపై స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ టౌన్‌ప్లానింగ్ అధికారులు పలుమార్లు దుకాణాలు తొలగించారని, తర్వాత యథావిధిగా వారంతా మళ్లీ అక్కడే వాటిని ఏర్పాటు చేసుకున్నారని చెబుతున్నారు. ఈ సారి అంతే జరుగుతుందేమోనని అంటున్నారు. ఏడాదికి ఒకటి, రెండు సార్లు జరిగే తంతే అని పెదవి విరుస్తున్నారు. జోన్–8 జోనల్ కమిషనర్ హెచ్.శంకరరావు, ఏసీపీ రామలింగేశ్వర రెడ్డి, ట్రాఫిక్ సీఐ సురేష్ పర్యవేక్షణలో తొలగింపు జరిగింది. పలు దుకాణాలను జోన్–8 కార్యాలయానికి తరలించారు. పలువురికి జరిమానాలు విధించారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో విస్తృత అవకాశాలు



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

మురళీనగర్: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని టిడ్కో మాజీ చైర్మన్ జె.ప్రసన్న కుమార్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల సక్సెస్ పార్టీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశాభివృద్ధిలో సివిల్ ఇంజినీరింగ్ కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని తెలుసుకుని సివిల్ ఇంజినీరింగ్ విభాగ విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగు పడాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సివిల్ ఇంజినీరింగ్ హెడ్ సంధ్యారాణి, స్టూడెంట్ అడ్వైజర్ ఎస్వీ రమణ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు.

రైల్వే ఆస్పత్రిలో ఆరోగ్య శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో స్వచ్ఛతా హీ సేవా–2025 కార్యక్రమంలో భాగంగా దొండపర్తి డివిజనల్ రైల్వే ఆస్పత్రి వద్ద గురువారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈకార్వో ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో యుక్త వయసు బాలికలు, మహిళలు, పిల్లల కోసం కేంద్ర వైద్య ఆరోగ్య సంక్షేమ, మహిళా శిశు సంరక్షణ విభాగం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ప్రారంభించినట్లు తెలిపారు. ఎనీమియా, హైపర్ టెన్షన్, డయాబెటీస్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, నివారించడం గురించిన పలు ఆరోగ్య పరీక్షలను మహిళలకు రైల్వే హాస్పిటల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 2 వరకు ఆరోగ్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇ.శాంతారం(ఇన్‌ఫ్రా), డాక్టర్ చారుమతి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ లక్ష్మణరావు, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(అడ్మినిస్ట్రేషన్), ఈకార్వో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.